
ప్రజాశక్తి

శనివారం 1 మార్చి 2025

5

పార్వతీపురం మన్యం




యువతకు కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక వైటిసి భవనంలో వైటిసి మేనేజర్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బిసి యువతకు 90 రోజులు కంప్యూటర్ శిక్షణ ఇస్తూ ఉచిత భోజనం, వసతి కల్పించి రోజుకు రూ.300 ఇస్తున్నట్లు ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి తెలిపారు. కావున ఆసక్తిగల యువత మార్చి 10లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంకా ఏమైనా సందేశాలు ఉంటే వారి పరిధిలో గల సచివాలయంలో సంప్రదించాలని తెలిపారు. మార్చి 15 నుంచి శిక్షణా తరగతులు నిర్వహిస్తారని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అదే నిర్లక్ష్యం

- సాగునీటి ప్రాజెక్టులకు కంటితుడుపు కేటాయింపులు
- నిరుద్యోగులకు నిరాశ
- కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు లేని ఉద్యోగభద్రత



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర బడ్జెట్‌లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలపై మునుపటి మాదిరిగానే నిర్లక్ష్యం, వివక్ష కొనసాగింది. వ్యవసాయం, ఉద్యాన పంటలు, వాటి అనుబంధ రంగాలకు పెద్దపీట వేస్తామంటూనే అందుకు అవసరమైన నీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యపు వరదను పారించింది. నిరుద్యోగులను నిరాశ పర్చింది. కాంట్రాక్టు ఉద్యోగులు, కార్మికులను తీవ్ర అభద్రతా భావంలోకి నెట్టింది. వీటన్నింటికి మించి విజన్ స్వర్ణాంధ్ర సాధనకు అనుగుణంగానూ నిధులు కేటాయింపు కనిపించలేదు. రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం శాసన సభలో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. దీన్ని ఉమ్మడి విజయ నగరానికి చెందిన టిడిపి, జనసేన ఎమ్మెల్యేలు, ఆయా పార్టీలకు చెందిన నాయకులు గొప్పగా చెప్తున్నప్పటికీ, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. జిల్లా అభివృద్ధికి గాని, సంక్షేమానికి గాని తోడ్పాటునందించే బడ్జెట్ కేటాయింపులు లేకపోవడమే ఇందుకు కారణం. ఈ రెండు జిల్లాలూ పూర్తిగా వ్యవసాయాధారితమైనవి. ఈ నేపథ్యంలో సాగునీటి వనరుల అభివృద్ధి అత్యంత కీలకం అన్న ప్రతి ఎన్నికల్లోనూ అధికార ప్రతిపక్ష పార్టీలు పదేపదే చెప్తున్నవే. కానీ, అందుకు అనుగుణంగా కేటాయింపులు లేవు.

తోటపల్లికి కంటితుడుపు కేటాయింపు

64వేల ఎకరాల పాత ఆయకట్టును స్థిరీకరిస్తూనే, కుడి కాలువ ద్వారా విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో అదనంగా 1,31,221 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన తోటపల్లి సాగునీటి ప్రాజెక్టు ఇప్పటికీ సగం విస్తీర్ణానికే నీరందిస్తోంది. ఏటా అరకొర నిధులు కేటాయించి, వాటిని కూడా ఖర్చు చేయకపోవడమే కారణం. నిర్మాణ పనులు, భూసేకరణ, నష్టపరిహారం కోసం ఈ ఏడాది రూ.519.1119కోట్లు కేటాయించాలని ప్రాజెక్టు అధికారులు ప్రతిపాదనలు పంపగా, ఆచరణలో ప్రభుత్వం రూ.47.81కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ నిధులు ఏమూలకూ సరిపోని పరిస్థితి. గత ఏడాది కాలువల నిర్మాణాలు, ఇతర పనుల కోసం రూ.279.96 కోట్లు, భూసేకరణకు రూ.55.81 కోట్లు, నష్ట పరిహారం, పునరావాసం కోసం రూ.119.10 కోట్లు, సిఎడిడబ్ల్యుఎంకు రూ.110.06 కోట్లు, నిర్వహణకు రూ.65 లక్షలు.. చొప్పున మొత్తం రూ.565.58 కోట్లు అవసరం కానున్నట్టు తోటపల్లి ప్రాజెక్టు అధికారులు ప్రతిపాదనలు పంపిస్తే, కేవలం రూ.36.85 కోట్లు మాత్రమే కేటాయించింది. ఇందులో ఖర్చుచేసింది కేవలం రూ.56లక్షలే.

సంక్షేమమూ సగం సగమే

అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి పథకాలకు కేటాయింపులు చూపినప్పటికీ ఆ నిధులు అర్హులందరికీ సరిపోయే పరిస్థితి లేదని, దీన్ని కప్పిపుచ్చుకోవడానికి నిబంధనల పేరుతో వడపోతకు దిగజారే ప్రమాదం లేకపోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత ఎన్నికల్లో కుటమి పార్టీలు పదేపదే చెప్పిన నిరుద్యోగ భృతి గురించి బడ్జెట్‌లో కనీస ప్రస్తావన లేదు. దీంతో, మెగా డిఎస్‌సి కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు, గ్రూప్ -2 అభ్యర్థులకు మరింత నిరాశకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆప్కాస్‌ను రద్దుచేసి, తిరిగి పాత కాంట్రాక్టు పద్ధతిని పునరుద్ధరించేందుకు నిర్ణయించడం ఉద్యోగులు, కార్మికుల్లో అభద్రతా భావానికి దారితీసింది. తల్లికి వందనం కేటాయించాల్సిన నిధులు తగ్గించడంతో విద్యార్థుల వడపోత చేపట్టనున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఊసే లేదు. నెలకు రూ.1500 ఇచ్చే మహాశక్తి పథకాన్ని మాయం చేశారు. నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తామని చెప్పి బడ్జెట్ లో ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా నిరుద్యోగులను మోసం చేశారు. ఎన్నికల హామీలను గాలికి వదిలేసి మసి పూసి మారేడు కాయ చేశారు.

పేదలకు మేలుచేసే బడ్జెట్ కాదు



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వార్షిక బడ్జెట్ లో పేదలకు మేలు చేసే పథకాలేవీ లేవు. మన్యం జిల్లాలో దీర్ఘకాలం గా జంఝావతి, గుమ్మడిగెడ్డ ప్రాజెక్టులు పెండింగ్ లో ఉన్నాయి. బడ్జెట్లో ఇరిగేషన్ ప్రాజెక్టులకు కేటాయించిన 11వేల కోట్లు జిల్లాలోని ప్రాజెక్టుల వరకు వస్తాయనే గ్యారెంటీ లేదు. గిరిజన అలాగే జిల్లా కేంద్రంలోని సూపర్‌స్పెషాల్టీ ఆసుపత్రికి కురుపాం, పాలకొండ నియోజకవర్గ కేంద్రాల్లో ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి నిధులు కేటాయించలేదు. కావున జిల్లా అభివృద్ధికి రూ.10వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాం.

- కొల్లి గంగునాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి

పేదలను నిలువునా మోసం చేసే బడ్జెట్



గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు గురించి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో ప్రస్తావన లేదు. రైతు భరోసా, అమ్మకు వందనం పథకాలకు అరకొర నిధులు కేటాయించారు. దీంతో లబ్ధిదారుల సంఖ్యకు కోత పడే అవకాశం ఉంది. మహిళలకు నెలనెలా ఆర్థిక సహాయం, ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ యువతకు భృతి, ఉద్యోగాల భర్తీకి సంబంధించిన హామీల ఊసే లేదు. మరోసారి పేదలను నిలువునా మోసం చేయడానికి టిడిపి ప్రభుత్వం సిద్ధమైంది.

పి.రాజన్నదొర, మాజీ డిప్యూటీ సిఎం

ఎన్నికల హామీల అమలుకు బడ్జెట్ తోడ్పాటు



రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ సూపర్ సిక్స్ పథకాల అమలుకు తోడ్పడుతుంది. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేసేందుకు ఈ బడ్జెట్ ను ప్రవేశపెట్టిందన్నారు. తల్లికి వందనం కార్యక్రమానికి ప్రభుత్వం రూ.9,407 కోట్లు, అన్నదాత సుఖీభవకు రూ.6,300 కోట్లు, సామాజక పింఛన్ల పంపిణీకి రూ.27,518 కోట్లు, దీపం పథకానికి రూ.2,601 కోట్లు బడ్జెట్‌లో విడుదల చేసిందన్నారు. ఈ బడ్జెట్ వల్ల సూపర్ సిక్స్ పథకాలన్నింటినీ అమలు చేసే అవకాశం ఉందన్నారు.

బోనెల విజయచంద్ర, ఎమ్మెల్యే, పార్వతీపురం.

ఉద్యోగులకు ఆశాజనకంగా లేని బడ్జెట్



రాష్ట్ర బడ్జెట్ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు ఆశాజనకంగా లేదు. వీరికి రావాల్సిన పిఆర్‌సి , డిఎలు, ఎపిజిఎల్‌ఐ, పిఎఫ్, లీవులకు కేటాయింపులు లేకపోవడం విచారకరం. ఈ ప్రభుత్వం వచ్చిన మొదటి సంవత్సరం లోనే ఉద్యోగుల ఆశలు సన్నగిల్లడం ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నా ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గానికి బాధను కలగజేసింది.

అమరాపు సూర్యనారాయణ, పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు

అంకెల గారడీ బడ్జెట్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీ లా ఉంది. గత ఎన్నికల మేనిఫెస్టోలో టిడిపి కూటమి పార్టీలు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత లేదు. సూపర్ సిక్స్ హామీల అమలుపై ఆశతోనే పేద, మధ్యతరగతి ప్రజలు కూటమి పార్టీలకు ఓటేశారు. రైతు భరోసా, అమ్మకు వందనం పథకాలకు మాత్రమే అరకొర నిధులు కేటాయించి మిగిలిన సంక్షేమ పథకాలకు మొండిచేయి చూపించారు.

గేదెల రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు, మన్యం జిల్లా

ఇది డొల్ల బడ్జెట్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంత డొల్లమయంగా ఉంది. జిల్లా అభివృద్ధి కోసం నిధులు కేటాయించలేదు. సూపర్ సిక్స్ లో పేర్కొన్న నిరుద్యోగ భృతి గాని, 18ఏళ్లు నిండిన మహిళలకు రూ.15వందలు విషయం గాని, ఉచిత బస్సు వంటి విషయాల ప్రస్తావన లేదు. జిల్లా సమగ్ర అభివృద్ధికి, ప్రణాళికలు లేవు. జిల్లా అభివృద్ధి కోసం నిధుల కేటాయింపుపై ఉమ్మడి జిల్లాలో ఉన్న మంత్రులు ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడాలి.

- కూరంగి మన్మధరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి

విద్యారంగానికి నిధులు పెంచాలి



రాష్ట్రంలో ప్రాథమిక విద్యారంగానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలి. శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేటాయించిన నిధులు రూ.31,805 కోట్లు పూర్తి స్థాయిలో అభివృద్ధికి సరిపోవు. మొత్తం బడ్జెట్ లో ఇది కేవలం 9.86 శాతం మాత్రమే. గత ఏడాది కన్నా రెండు శాతం తగ్గించారు. నూతన విద్యావిధానంలో భాగంగా మోడల్ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు, రవాణా సౌకర్యాల కల్పనకు నిధులు పెంచాలి. కొఠారీ కమిషన్ చెప్పిన ప్రకారం 20 శాతం నిధులు కేటాయించాలి.

ఎస్.మురళీమోహన్ రావు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి .

వేతన జీవులను నిరాశపరిచిన బడ్జెట్



రాష్ట్ర బడ్జెట్‌లో వేతన జీవులకు మొండిచేయి చూపించారు. ప్రభుత్వ ఉద్యోగుల పిఆర్సీ కమిటీ ఏర్పాటు, డిఎ చెల్లింపు వంటి అంశాల ఊసే లేదు. అంగన్వాడీలకు గ్రాట్యుటీకి సంబంధించిన ప్రస్తావన లేదు. ఆశా, మధ్యాహ్న భోజన కార్మికుల జీతాల పెంపు పై ప్రస్తావన లేదు.వేతన జీవులను పూర్తిగా నిరాశపరిచిన బడ్జెట్ ఇది.

ఎన్వై నాయుడు, సిఐటియు జిల్లా కార్యదర్శి,

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

34 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

వీరఘట్టంలో బెంచీలు తెచ్చుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మార్చి 1 నుంచి (శనివారం) జరగనున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. విద్యార్థులు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో రాసుకొనేలా ఇంటర్ బోర్డు అధికారులు చర్యలు తీసుకున్నారు.జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీలకు చెందిన ఇంటర్ మొదటి సంవత్సరం 8968 మంది, ద్వితీయ సంవత్సరం 8881 మంది మొత్తంగా 17,849మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో ప్రాక్టికల్ పరీక్షలు కూడా పూర్తయ్యాయి. ఇంటర్ పబ్లిక్ పరీక్షలు మార్చి 1 నుంచి 15 తేదీ వరకు జిల్లాలో 34 కేంద్రాల్లో జరగనున్నాయి. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్షా కేంద్రాల్లో గాలి, వెలుతురు, మరుగుదొడ్లు, తాగునీరు,విద్యుత్ వంటి సమస్యలు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సిసి కెమేరాలు ఏర్పాటు చేశారు. హాల్ టికెట్లు అన్ని కాలేజీల్లో అందుబాటులో ఉంటాయి. ఈ ఏడాది కొత్తగా ప్రభుత్వం విద్యార్థి ఫోన్ నెంబర్‌కు హాల్ టికెట్లు పంపిస్తామన్నారు. విద్యార్థులు ఇచ్చిన ఫోన్ నెంబర్‌లో హాల్ టికెట్లు తీసుకొనే అవకాశం కల్పించడం జరిగింది.

జిల్లాలో 34 పరీక్షా కేంద్రాల్లో జరగనున్న ఇంటర్ పరీక్షకు కోసం మొత్తం 500 మంది సిబ్బందిని నియమించారు. వీరితో పాటు రెండేసి ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్లు వేశారు. పరీక్షల విధులు నిర్వహించే ఉద్యోగులు ఎవ్వరూ సెల్ ఫోన్, ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు ఉపయోగించడానికి అనుమతి లేదని ఆదేశాలు జారీ చేశారు. అలాగే ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. విద్యార్థులు సైతం ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్ ఫోన్లు తీసుకొస్తే పరీక్షకు అనుమతించడం జరగదని ఇప్పటికే అధికారులు ప్రకటించారు. కేవలం పెన్, అట్ట, హాల్ టికెట్లు మాత్రమే విద్యార్థుల వెంట తెచ్చుకోవాలి. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకుని, తిరిగి వారి ప్రాంతాలకు చేరుకునేలా ఆర్టీసీ బస్సులను నడపాలని, ప్రతి కేంద్రం వద్ద ఎఎన్‌ఎంలను, మందులతో ప్రథమ చికిత్స శిబిరాలను ఏర్పాటు చేయాలని, తాగునీరు, పారిశుద్ధ్యం ఏర్పాట్లను ప్రతి రోజూ పర్యవేక్షించాలని మున్సిపల్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. పరీక్షలు ప్రారంభం నుంచి ముగిసే వరకు కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం ఉండరాదని ఎపిఇపిడిసిఎల్ అధికారులను డిఆర్‌ఒ కె.హేమలత ఆదేశించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, జిల్లాలో ఎటువంటి సమస్యాత్మక, సునిసిత కేంద్రాలు లేవని, పరీక్షలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులకు అనుమతి లేదని, కావున సకాలంలో పరీక్ష హాల్లోకి చేరుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి మంజులవాణి పేర్కొన్నారు.



వీరఘట్టంలో ట్రాక్టర్‌పై నుంచి బెంచీలు దించుతున్న విద్యార్థులు

బెంచీలు తెచ్చుకుంటున్న విద్యార్థులు

వీరఘట్టం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మార్చి 1 నుంచి జరగనున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా పరీక్ష కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో శుక్రవారం విద్యార్థులు ట్రాక్టర్‌తో వేరే ప్రాంత నుంచి బెంచీలు తెచ్చుకుంటున్నారు. ఒకవైపు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు ప్రకటించారు. మరోవైపు కనీస సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రతి ఏటా పరీక్షలు నిర్వహిస్తే ఇదే పరిస్థితి కొనసాగుతుంది. ఇంటర్ మొదటి సంవత్సరం 315 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 238 మంది విద్యార్థులు పరీక్షకు రానున్నారు.

మూడు పంటలు లక్ష్యంగా ప్రణాళికలు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ప్రతి ఏటా మూడు పంటలు లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులను ఆదేశించారు. ఎపిసిఎన్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయంపై జిల్లా స్థాయి సమన్వయ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏడాదిలో మూడు పంటలు పండాలని, అందుకు అందుబాటులో ఉన్న వనరులను వినియోగించు కోవాలని సూచించారు. ముఖ్యంగా వ్యవసాయానికి సాగునీరు అవసరమని, ఇందుకు ఉపాధి హామీ కింద ఫార్మ్‌పాండ్స్, చెక్ డ్యాములు, చెరువుల పునరుద్దరణ వంటివి చేపట్టకోవచ్చని తెలిపారు. ప్రతిపాదించిన పనులను మే నెలాఖరులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రకృతి వ్యవసాయం ప్రయోజనాలను రైతులకు వివరించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి రావడమే కాకుండా ప్రజల ఆరోగ్యం కూడా బాగుంటుందనే విషయాన్ని రైతులకు తెలియజేయాలని తెలిపారు. ఇప్పటికే ప్రకృతి వ్యవసాయం చేసి, అధిక లాభాలు ఆర్జించిన రైతుల విజయగాథలను, వారి అనుభవాలను వీడియోగా చిత్రీకరించి వాటిని గ్రామస్థాయిలో ప్రదర్శించాలని అన్నారు.. వ్యవసాయ అనుబంధ రంగాలపై కూడా అధికారులు దృష్టి సారిం చాలని, ఇందుకు ఆయా శాఖలతో సమన్వయం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ షణ్ముఖరాజు, జిల్లా ఉద్యాన వన శాఖాధికారి బి.శ్యామల, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డా.ఎస్.మన్మధరావు, డిఆర్‌డిఎ పీడీ వై.సత్యంనాయుడు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా.శ్రీనివాస్‌రాజు, వ్యవసాయ, ఉద్యానవన అధికారులు, విస్తరణాధికారులు, ఎపిసిఎన్ఎస్ అదికారులు పాల్గొన్నారు.

మార్చిలోగా రూ. 37 కోట్ల పనులు పూర్తి

ఉపాధి హామీ కింద చేపట్టిన పనులన్నీ మార్చి నెలాఖరులోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఫిబ్రవరిలో రూ.26 కోట్ల మేర పనులు పూర్తిచేశారని, వాటి బిల్లులను శుక్రవారం లోగా సమర్పించాలని అన్నారు. ఉపాధి హామీ పనులపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఉపాధి హామీ కింద ఇచ్చిన పనులను పూర్తి చేస్తే, జిల్లాకు మరిన్ని కొత్త పనులు చేసుకునేందుకు వీలుంటుందన్నారు. మార్చిలో ఐటిడిఎ, పిఆర్, పిఐయు ద్వారా రూ.37కోట్ల పనులను పూర్తిచేయాలని లక్ష్యాలను నిర్దేశించామన్నారు. అందులో ఐటిడిఎ రూ.15 కోట్లు, పంచాయతీ రాజ్ రూ.15 కోట్లు, పిఐయు రూ.6.67 కోట్ల పనులను చేపట్టాల్సి ఉందని తేల్చిచెప్పారు. ఇచ్చిన లక్ష్యాలను శత శాతం పూర్తిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందులో నిర్లక్ష్యం వహించరాదని, బిల్లులను ఎప్పటికప్పుడు ఆన్ లైన్‌లో అప్ లోడ్ చేయాలని సూచించారు. పిఎంజిఎస్‌వై -4 కు జిల్లా ఎంపికైందని కలెక్టర్ తెలిపారు. దీని ద్వారా 250 మంది జనాభా ఉన్న గ్రామాలకు ఏడాది పొడవునా రోడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించబడతాయన్నారు. వాటి అంచనాలను రూపొందించి, డిపిఆర్ లను మార్చి 10లోగా సిద్ధం చేయాలని ఆదేశించారు సమావేశంలో డ్వామా పీడి కె.రామచంద్రరావు, పిఆర్ ఇంజినీరింగ్ అధికారి బి.చంద్రశేఖర్, పలువురు ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



వ్యవసాయాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

సాంకేతిక పరిజ్ఞానంతో కేసుల పరిష్కారం : ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మెరుగైన ప్లాన్ ఆఫ్ యాక్షన్, క్వాలిటీ ఇన్వెస్టిగేషన్, సాంకేతిక పరిజ్ఞానంతో పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్‌పి ఎస్‌వి మాధవ్ రెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలతో శుక్రవారం ఆయన జూమ్ వీడియో కాన్ఫరెన్స్ (వర్చువల్ విధానం)లో మాసాంతపు నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, ప్రస్తుత కేసుల స్థితిగతులు, నమోదైన కేసుల్లో నేరస్థుల అరెస్టు, కేసు దర్యాప్తు తీరుతెన్నులపై సంబంధిత పోలీస్ అధికారులను ఆరా తీసి కేసుల ఛేదింపునకు, పరిష్కారానికి, నేర నియంత్రణకు దోహదం చేసే పలు సూచనలు, మెళకువలను అధికారులకు దిశా నిర్దేశాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు స్టేషన్లలో నమోదయ్యే కేసుల/ముద్దాయిల వివరాలను ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా సీసీ టిఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు పొందుపర్చాలన్నారు. కేసుల్లో ఉన్న నేరస్తులు, వేరే చోట నేరాలకు పాల్పడ్డారో లేదో అన్న అంశాలను ఐసిజెఎస్ పోర్టల్లో పరిశీలించాలని సూచించారు. ముద్దాయిలు కోర్టుకు హాజరయ్యేలా చూడాలని, ఎన్‌విడబ్ల్యూ త్వరితగతిన అమలయ్యేలా చూడాలని సూచిస్తూ, కోర్టులో సిసి/ఎస్సి నంబర్స్ పెండింగ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్‌డిపిఒ అధికారులు తమపరిధిలో ఉన్న స్టేషన్ అధికారులు, పెండింగ్ కేసులపై దృష్టి సారించేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. స్టేషన్ పరిధిలో ఎక్కువ నేరాలకు, తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారిపై హిస్టరీ షీట్ ఓపెన్ చేయాలని, రౌడీ షీటర్లపై ప్రత్యేకమైన నిఘా ఉంచాలని, తరచుగా నేరాలకు పాల్పడే, శాంతి భద్రతలకు విఘాతం కల్పించే వ్యక్తులను బైండోవర్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. డ్రంక్, డ్రైవ్, వంటి చట్ట వ్యతిరేక/ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాలని వేయ్యాలని, నాటు సారా, మద్యం అక్రమ రవాణాను నియంత్రించి కేసులు ఎక్కువగా నమోదు చేయాలని ఎన్ఫోర్స్మెంట్ పెంచాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. హెల్మెట్ ధారణ, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్ధాల పట్ల ప్రజలకు అవగాహనా కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పార్వతీ పురం ఎఎస్ పి అంకిత సురాన, పాలకొండ డిఎస్‌పి రాంబాబు, సిఐలు, ఎస్సైలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

ప్రజాశక్తి - సాలూరు

గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో టిడిపి కూటమి ప్రభుత్వం విఫలమైందని, దీన్ని ఎండగట్టడంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుండాలని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర చెప్పారు. శనివారం తన నివాసంలో కొత్తగా నియామకమైన సంస్థాగత కమిటీ చైర్మన్లు రాజన్నదొరను దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయడంలో టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలను మోసగించిందని, ఒకటి, రెండు పథకాలు అమలు చేసి చేతులెత్తేసే ప్రయత్నంలో ఉందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తోందని విమర్శించారు. వైసిపి నాయకులపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల కోడ్ తర్వాత నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ తాను పర్యటిస్తానని చెప్పారు. గ్రామస్థాయిలో పార్టీ కేడర్‌కు అండగా నిలబడాలని సూచించారు. అనంతరం వివిధ విభాగాల వైసిపి జిల్లా అధ్యక్షులు రాజన్నదొరను సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు కౌన్సిలర్ గొర్లి వెంకటరమణ, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ పాల్గొన్నారు.

టిబి రోగులకు సహకరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రధాన మంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ (పిఎంటిబిఎంబిఎ) పథకం కింద టిబి రోగులకు పోషకాహార సహకారం అందించడానికి నిక్షయ్ మిత్రలుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా పౌరులకు విజ్ఞప్తి చేశారు. టిబి రోగులకు పోషకాహార మద్దతు కోసం నిక్షయ్ మిత్రలుగా నమోదు చేసుకున్నవారు, నెలకు రూ. 700 చొప్పున గరిష్టంగా 6 నెలల వరకు, రూ.4200 ఆర్థిక సహాయం అందించవచ్చున్నారు. తాను స్వయంగా నిక్షయ్ మిత్రగా నమోదు చేసుకుని టిబి రోగులకు సహకారం అందిస్తున్నానని, ముఖ్యంగా ఉద్యోగులు ముందుకు వచ్చి రోగులను దత్తత తీసుకొని నిక్షయ్ మిత్రగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. జిల్లా టిబి నియంత్రణ అధికారి డాక్టర్ ఎం.వినోద్‌కుమార్ మాట్లాడుతూ నిక్షయ్ మిత్రగా సహకారం టిబి రోగులకు ఎంతో అవసరం,గిరిజన ప్రాంతాల్లో పోషకాహార లోపం టిబి వ్యాధిని మరింత తీవ్రతరం చేస్తుంది. నిక్షయ్‌మిత్ర సహకారంతో రోగులు త్వరగా కోలుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. నిక్షయ్ మిత్రలుగా నమోదు చేసుకోవడానికి ఆసక్తి ఉన్నవారు జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టిబి అధికారి, పార్వతీపురం మన్యం, ఖాతా సంఖ్య: 00401201 0003135, IFSC **కోడ్:** UBIN0800406 చిరునామా: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బెలగాం, మెయిన్ రోడ్, పార్వతీపురం మన్యం, ఫోన్ నంబర్: 9440365134 చిరుమానాకు విరాళాలిచ్చి ఆదుకోవాలని కోరారు.

2న 'శతర' ఆదివాసీ కవితా సంపుటి ఆవిష్కరణ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

జిల్లాకు చెందిన ప్రముఖ కవి సిరికి స్వామినాయుడు రాసిన " శతర " ఆదివాసీ కవితాసంపుటి ఆవిష్కరణ మార్చి 2న హైదరాబాద్‌లోని బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జరుగుతుంది. ఈ సభలో సుప్రీంకోర్టు పూర్వ ప్రధానన్యాయమూర్తి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి ప్రముఖ పాత్రికేయులు కె.శ్రీనివాస్, ప్రముఖ కథారచయితలు జయధీర్ తిరుమలరావు, అట్టాడ అప్పల నాయుడు, కెఎన్ మల్లీశ్వరి, మల్లిపురం జగదీష్, దాసోజు లలిత పాల్గొంటారు. అనంతరం జరగనున్న సాహిత్య సదస్సులో రెండు తెలుగు రాష్ట్రాల సాహిత్య ప్రముఖులు పాల్గొంటారు. శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాటం తర్వాత దోపిడీ ఏ విధంగా రూపాంతరం చెందింది? మతం గూడల్లోకి చొరబడ్డాక సనాతన ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలు, పండగలు ఏవిధంగా కనుమరుగై పోతున్నాయి? అభివృద్ధి పేరుతో విధ్వంసం ఏవిధంగా జరుగుతోంది ? నాగరికత ప్రవేశించాక నిర్మలమైన గూడలు గ్లోబల్ గూడలుగా ఎలా మారాయి? అన్న పలు అంశాలను స్వామినాయుడు శతర ఆదివాసీ కవిత్వంలో కవితలుగా తీర్చిదిద్దారు. తెలుగు సాహిత్య చరిత్రలో మొదటి ఆదివాసీ కవితా సంపుటిగా శతర నిలబడింది. పార్వతీపురం లోని స్నేహకళాసాహితి సాహితీ సంస్థ సమర్పణలో వచ్చిన శతర ఆదివాసీ కవిత్వం హైదరాబాద్‌లో ఆవిష్కరించడం ముదావహ మని ప్రముఖ కథారచయిత గంటేడ గౌరునాయుడు, సంస్థ కార్యదర్శి శాంతి, మల్లిపు రం, చింతా అప్పలనాయుడు, పక్కి రవీంద్రనాద్, చందన పల్లి గోపాలరావు, పల్ల రోహిణీకుమార్, విద్యా శాఖ అధికారులు అభినందనలు తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి రెండేళ్ల శిక్ష

పార్వతీపురంరూరల్ : హత్యాయత్నం కేసులో నిందితుడు కి రెండేళ్లు కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధించినట్లు ఎఎస్పీ ఎస్ వి మాధవ్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలం కృష్ణపల్లికి చెందిన మీనక ప్రభాకర్‌కు అదే గ్రామానికి చెందిన బందలుప్పి రాము భార్యతో అక్రమ సంబంధం ఉందనే అనుమానంతో తరుచూ గొడవలు పడుతుండే వాడు. పాతకక్షలు కారణంగా 2022 మే 19న ప్రభాకర్ తలపె గాజు సీసాతో రాము దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడ్ని అరెస్టు చేసారు. ఈ కేసు విచారణలో నిందితుడుపై నేరారోపణలు రుజువు కావడంతో పై శిక్ష విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్ జడ్జిఎస్.అరుణ శ్రీ శుక్రవారం నాడు తీర్పు వెల్లడించారు.

ఆదర్శ గ్రామంగా మనుమకొండ

ప్రజాశక్తి -భామిని

ఆస్పిరేషన్ బ్లాక్ ప్రోగ్రామ్ కింద ఎంపికైన మండలంలోని మనుమకొండను నీతి అయోగ్ ఆదర్శ గ్రామంగా ఎంపిక చేసిందని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మనుమకొండ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో అన్ని వీధులు తిరిగి గ్రామ పరిసరాలను, గ్రామంలో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. గ్రామంలో పిఎం జన్‌మాన్ కింద మంజూరైన గృహ నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామంలో ఇంకా పెండింగ్లో ఉన్నవారికి ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేయాలని సూచించారు. గ్రామంలో ఉన్న శ్మశాన వాటికకు రహదారి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్యాస్ కనెక్షన్ లేని వారికి కొత్త గ్యాస్ కనెక్షన్లు ఇప్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తూరుగూడ నుండి మనుమకొండకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు. గ్రామంలో ఉన్న విడివికెలను మరమ్మతులు చేయిస్తామన్నారు. విడివికె సభ్యులకు పేపర్ ప్లేట్ యంత్రం మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో ఉన్న చిన్నారులతో ముచ్చటించారు. చిన్నారులకు పంపిణీ చేస్తున్న గుడ్లు, భోజనాలను పరిశీలించారు. మరుగుదొడ్ల పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నారులకు ఆటపాటలతో చదువు నేర్పించాలని అంగన్వాడి వర్కర్‌కు సూచించారు. అనంతరం మనుమకొండ బాలుర ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. భోజనాన్ని పరిశీలించి రుచికరంగా ఉండాలని, మెనూ ప్రకారం భోజనం పెట్టాలని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాలు పెంపునకు చర్యలు తీసుకోవాలని హెచ్ఎంకు సూచించారు.

ప్రభుత్వ వైద్య కేంద్రాల్లో ప్రసవాలు సంఖ్య పెరగాలి

ఐటిడిఎ పరిధిలో గల పిహెచ్‌సిలో ప్రసవాల సంఖ్య పెరగాలని పిఒ సూచించారు. బత్తిలి పిహెచ్‌సిని పరిశీలించిన ఆయన ఆసుపత్రికి వచ్చే రోగుల రిజిస్టర్‌ను పరిశీలించారు. గర్భిణీలకు సంబంధించిన ప్రసవాలు తెలియజేసే క్యాలెండర్‌ను తనిఖీర చేశారు. ఫార్మసీ స్టోర్ ను పరిశీలించి మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మరుగుదొడ్లను మరమ్మత్తులు చేయించాలని సూచించారు. బయోవ్యర్థాలు లేకుండా చూసుకోవాలన్నారు.

జల జీవన్ మిషన్ తో అన్ని గ్రామాలకు తాగు నీరు

మండలంలోని అన్ని గ్రామాలకు సురక్షిత తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని సింగిడి గ్రామంలో చేపడుతున్న రక్షిత మంచినీటి ప్రాజెక్టు పనులను ఆయన పరిశీలించారు. రూ.40 కోట్ల నిధులతో ఈ రక్షిత మంచినీటి ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నామని, ఈ ప్రాజెక్టు పూర్తయితే మండలంలోని 54 గ్రామాలకు తాగునీరు అందుతుందన్నారు. ఈ పథకం ద్వారా ఇంటికి కొళాయిలు ఏర్పాటు చేసి నీరందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 44,093 మంది జనాభాకు 45 వాటర్ ట్యాంకుల ద్వారా 72 కిలోమీటర్ల మేర పైపులైను నిర్మించి ఈ ప్రాజెక్టు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.సత్యం, మనుమకొండ సర్పంచ్ నిమ్మల కేశవ, సిడిపిఒ శాంతి భవాని, వైద్యాధికారులు కె.రవీంద్ర, దామోదరరావు హౌసింగ్ ఎఇ, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ, ఎపిఎం, ఎపిఒ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


మనుమకొండలోని వీధుల్లో పర్యటిస్తున్న పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

జిల్లాలో సుస్థిర ఆర్థిక వృద్ధికి చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో సుస్థిర ఆర్థికవృద్ధి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల్లో ఆర్థిక పురోగతిపై నీతి ఆయోగ్ సభ్యులు శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ, ఉద్యానవన, పర్యాటక, పారిశ్రామిక రంగాల్లో ఆర్థిక వృద్ధి చెందేందుకు ఎక్కువ అవకాశాలున్నాయని అన్నారు. జీడీ, అరటి, చింతపండు, పైనాపిల్, చిరుధాన్యాలు ప్రధానమని చెప్పారు. ఈ పంటలతో ఇప్పటికే అధిక లాభాలు ఆర్జిస్తున్నారని, వీటిని ప్రోత్సహించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అలాగే ఉద్యానవన పంటలకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించి, మరింత మార్కెట్ ఉండేలా కృషి చేస్తున్నామని, నిమ్మగడ్డి పంటను ప్రోత్సహించడం వల్ల ఆర్థిక వృద్ధి ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే జిల్లాలో పర్యాటక రంగంలో మంచి వృద్ధి సాధించేందుకు అవకాశం ఉందని, ఆ దిశగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. పారిశ్రామికంగా జిల్లా వృద్ధి చెందేలా కారిడార్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని అన్నారు. జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలతో సుస్థిర ఆదాయంతో పాటు ఆర్థికవృద్ధి ఉంటుందన్నారు. సమావేశంలో సిపిఒ వీర్రాజు, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఎం.వి.కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ రోడ్డు సమస్యపై స్పందించాలి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని గుమడ రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు సమస్యపై సంబంధిత అధికారులు స్పందించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. గుమడ రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారిని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ గుమడ రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారిని గతంలో రైల్వే అధికారులు బిటి రోడ్డుగా వేశారని, ప్రస్తుతం ఈ రహదారి పూర్తిగా మరమ్మతులకు గురవ్వడంతో ఇప్పుడు మళ్లీ ఆ రోడ్డు సగం వరకే బిటి రోడ్డు వేసి మిగతా సగం పంచాయతీ పరిధిలో ఉందని చెప్తున్నారని గత కొన్ని రోజుల్లోగా బిటి రోడ్డు వేయకుండా వదిలేయడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బిటి రోడ్డు కోసం వేసిన రాళ్ల వల్ల ప్రతిరోజు స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారన్నారు. కావున ఇప్పటికైనా ఇటు రైల్వే అధికారులు, అటు గుమడ పంచాయతీ శాఖ అధికారులు సమన్వయంతో ఈ రోడ్డును బాగు చేయాలని కోరారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు తిరుమల సాయి విద్యార్థి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 27న విజ్జి స్టేడియం ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ -14 సబ్ జూనియర్ బాయ్స్, గర్ల్స్ ఫెన్సింగ్ ఛాంపియన్ షిప్‌లో జియ్యమ్మవలస మండలం పెదమేరంగి తిరుమలసాయి ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఏడో తరగతి విద్యార్థి నిమ్మల జితేంద్ర రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మార్చి 1,2న కృష్ణా జిల్లా కంచికచర్ల ఏకత్వ స్కూల్‌లో జరిగే 11వ ఎపి రాష్ట్ర సబ్ జూనియర్ బాయ్స్, గర్ల్స్ ఫెన్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. విద్యార్థి ఎంపిక కావడం పట్ల పలువురు అభినందించారు.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జితేంద్ర

తాడికొండలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని తాడికొండలో శుక్రవారం పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని వీధి కాలువల్లో పూడికలు తీయడం, సమీప పరిసరాల్లో ఉన్న చెత్తను తొలగించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచారు. గ్రామంలో ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరరావు కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టేందుకు కొలతలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రమైన వీరఘట్టంలోని ఎల్లంకి వీధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు శుక్రవారం ఇంజినీరింగ్ సహాయకులు కొలతలు వేశారు. ఈనెల 28న 'ప్రజాశక్తి'తో ప్రచురితమైన మృతదేహాన్ని తరలించేందుకు అవస్థలు అన్న వార్తకు అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. నిర్మించిన కాలువపై పలకలు ఏర్పాటు, ఇరుకైన మార్గంలో మెట్లు నిర్మాణం, కొంతమేర కాలువ నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేసి పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.


రికార్డులను పరిశీలిస్తున్న ప్రోగ్రాం అధికారి రఘుకుమార్

హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

కురుపాం : హాస్టల్ విద్యార్థులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయాలని రాష్ట్రీయ బాలల సంరక్షణ కార్యక్రమం (ఆర్‌బిఎస్‌కె) ప్రోగ్రాం అధికారి డాక్టర్ రఘుకుమార్ అన్నారు. మండలంలోని మొండెంఖల్ పిహెచ్‌సి పరిధిలోగల వలసబల్లేరు హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అన్ని రుగ్మతలు కలిగిన వ్యాధులపై చేస్తున్న సర్వే గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి సర్వేలో ఇచ్చిన టార్గెట్ ప్రకారం చేయాలని, వైద్య పరీక్షలు చేసిన విద్యార్థుల వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి బి.ప్రజ్ఞ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నీటి కుంటల నిర్మాణానికి చొరవ చూపాలి

వీరఘట్టం: మండలంలోని నీటి కుంటల నిర్మాణానికి చొరవచూపాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ సాంకేతిక, క్షేత్ర సహాయకులకు ఆదేశించారు. శుక్రవారం స్థానిక కంప్యూటర్ సెంటర్లో సాంకేతిక, క్షేత్ర సహాయకులసమావేశంలో మాట్లాడారు. వ్యక్తిగత ఇంకుడు గుంతలు, పశువుల కుంటల నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి వేతనదారునికి వంద రోజులు పని కల్పించాలని, రోజుకు గరిష్ఠ వేతనం రూ.300 వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ జి.సత్యంనాయుడు, సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

గుణుపూర్ జంక్షన్ వద్ద వాహన తనిఖీలు

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని గుణుపూర్ మూడు రోడ్ల కూడలి, ఎల్విన్ పేట పోలీస్ చెక్ పోస్ట్ సమీపంలో శుక్రవారం రాత్రి సిఐ హరి వాహన తనిఖీలను చేపట్టారు. కురుపాం, పార్వతీపురం, ఒడిశా ప్రాంతాలకు వచ్చిపోయే ప్రతి వాహనాన్ని ఆపి పత్రాలు, నెంబర్ ప్లేట్లు పరిశీలించారు. ప్రతి వాహన దారుడు అన్ని పత్రాలు ఉండాలని, హెల్మెట్ తప్పని సరిగా వినియోగిం చాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే వేడుకలు

పార్వతీపురం రూరల్ : టైలర్స్ డే వేడుకలు పార్వతీపురంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వివేకానంద కాలనీలో గల టైలర్స్ బిల్డింగ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో టైలర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వల్లేపు చిన్నారావు, అధ్యక్షులు ముడిలి వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ముందుగా కేక్ కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వాలే సంక్షేమ పథకాల ద్వారా టైలర్లకు ప్రోత్సాహాలు అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మహాపాత్రుని శ్రీనివాసరావు, కోశాధికారి ఎం శంకర్రావు, సహాయకార్యదర్శి ఈశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా ఎర్ర రామకృష్ణ, ఉబ్బుశెట్టి సూరిబాబు, సాసుబిల్లి మోహన్, అల్లక శంకర్రావు, రామారావు, నాగు, వంగపండు లక్షణ, కర్రి సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి లక్షణాలు గుర్తించాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం / కురుపాం

ఆరోగ్య సర్వేలు పక్కగా చేపట్టి, ప్రజలకు మెరుగైన వైద్యలందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. నీలకంఠపురం, రావాడ రామభద్రపురం పిహెచ్సీలు, ఊసకొండలో శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలపై ఆరా తీసి ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షల రికార్డులు పరిశీలించారు. పరీక్షల నివేదికలు సకాలంలో తెలియజేయాలని ఆదేశించారు. మందుల నిల్వలు పరిశీలించి స్టాకు, వినియోగం రికార్డులు పక్కాగా నిర్వహించాలన్నారు. పిహెచ్‌సిల్లో ప్రసవాలపై ఆరా తీశారు. అక్కడ రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు, అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఆరోగ్య సర్వేలు ఎన్సీడి, ఆర్బిఎస్కె, అంగన్వాడీ స్క్రీనింగ్‌లు ఏ మేరకు పూర్తి చేశారని సంబంధిత వివరాలపై సమీక్షించారు. కేన్సర్ స్క్రీనింగ్‌లో అనుమానిత లక్షణాలతో ఎవరినైనా గుర్తించారా అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఎన్‌సిడి సర్వేలో రక్త పోటు, మధుమేహం ఇతర దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో ఎంత మందిని గుర్తించారు. వారి చికిత్స, పర్యవేక్షణపై ఆరా తీసి సర్వే పారదర్శకంగా చేపట్టి ఆరోగ్య ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తించాలని ఆదేశించారు. అలాగే క్షయ, కుష్టు లక్షణాలతో గుర్తించిన వారికి నిర్ధారణ పరీక్షలు చేయించాలన్నారు. అనంతరం డాక్టర్ భాస్కరరావు ఊసకొండ లో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. అక్కడ వినియోగించుకుంటున్న వారి ఆరోగ్య సమస్యలు వివరాలు పరిశీలించారు. గ్రామంలో ఎన్సీడి సర్వే ఏ విధంగా వైద్య సిబ్బంది నిర్వహించారో అక్కడ స్థానికులతో మాట్లాడి బిపి,షుగర్ తో ఎంతమంది ఉన్నారు తెలుసుకొని ఆ వివరాలు సర్వేలో ఏ మేరకు వైద్య సిబ్బంది నమోదు చేసారో గమనించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్బిఎస్కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ పిఎల్. రఘుకుమార్, వైద్యాధికారులు డా అభినవ్,డా శంకర్,డా అమరసింహారెడ్డి, డిఎస్ఒ శంకర్ వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

డ్రోన్ కెమెరాలతో నిఘా

ప్రజాశక్తి - గరుగుబిల్లి

నిందితుల జాడను పసిగట్టేందుకు పోలీసులు డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టారు. ఇందులో భాగంగా దీనిలో భాగంగా మండలంలోని మారుమూల ప్రాంతాల్లో చైన్ స్నాచెర్‌ను పట్టుకోవడానికి, నాటుసారా బట్టీలు కనుగొనడానికి, పేకాట స్థావరాలను కనిపెట్టడానికి వివిధ ప్రాంతాల్లో డ్రోన్ ఎగురవేసి గాలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్‌నాయుడు మాట్లాడుతూ ఇటీవల చినమేరంగి, వీరఘట్టం, గరుగుబిల్లి, సీతానగరం, బలిజిపేట మండలాల్లోని మారుమూల ప్రాంతాల్లో గొలుసు దొంగతనాలకు పాల్పడిన ఒక వ్యక్తిని పట్టుకోవడానికి గాలిస్తున్నట్లు తెలిపారు. సిసిఎస్ ఎఎస్ఐ బెడ్సన్, హెచ్‌సి రామకృష్ణ ఆధ్వర్యంలో డ్రోన్ హ్యాండిలర్ దేముడుబాబు ఆధ్వర్యంలో సదరు నిందుతుడిని పట్టుకోవడానికి ముమ్మరంగా శుక్రవారం ప్రయత్నాలు జరుగుతున్నాయి. చైన్ దొంగతనాల వ్యక్తి గురించినా, పేకాట, నాటుసారాలను గురించి ఎవరికైనా ఏమైనా సమాచారం తెలిసినట్లయితే, డయల్ 100, 112నెంబర్లకు, లేదా అందుబాటులో ఉన్న పోలీస్ స్టేషన్లకు ఫోన్ చేసి వెంటనే తెలియజేయాలని ఎస్ఐ తెలిపారు. సమాచారం ఇచ్చిన వారికి తగిన పారితోషికం ఇస్తామని పోలీసులు ప్రకటించారు.

గోశాలలో మౌలికవసతుల కల్పనకు సహకారం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

గరుగుబిల్లి మండలం తోటపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం దగ్గరలో మంజూరైన గోశాలలో మౌలికవసతులు కల్పనకు పట్టణానికి చెందిన గోకవరపు శ్రీనివాసరావు ముందుకొచ్చారు. నాలుగు ఎకరాల స్థలంలో గోశాల మంజూరు జరిగిన సంగతి తెలిసిందే. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రూ.50 లక్షలతో నిర్మిస్తున్నారు. గోశాలకు ప్రహరీగోడ, బోరు తదితర మౌలిక వసతుల కల్పనకు శ్రీనివాసరావు ముందుకొచ్చారు. ఈ పనులు చేపట్టేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అభినందించారు. మూగ జీవాల రక్షణకు ముందుకు రావడం ముదావహమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక అధికారి ఎస్ మన్మథ రావు, తోటపల్లి టెంపుల్స్ డెవలప్మెంట్ సేవా ట్రస్ట్ కార్యనిర్వాహక ట్రస్టీ డి పారి నాయుడు, కన్వీనర్ శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

వ్యాధుల కారకాలను నిర్మూలించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

వ్యాధుల వ్యాప్తి కారకాలను నిర్మూలించాలని, దీర్ఘకాలిక రోగుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని పులిగుమ్మిలో శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. వైద్య బృందంతో కలిసి గ్రామ పుర వీధుల్లో పర్యటించి ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాల నిర్వహణ తీరు గమనించారు. ప్రతి వారం వైద్య సిబ్బంది విసిహెచ్ యాప్‌లో దోమల ఉత్పత్తికారక ప్రదేశాలను గుర్తించి అప్లోడ్ చేసి సంబంధిత పంచాయతీ సెక్రటరీ ద్వారా నివారణా చర్యలు చేపట్టాలన్నారు. దీర్ఘ కాలిక రోగుల ఆరోగ్యం ఏ మేరకు మెరుగు పడుతుందో వైద్య సిబ్బంది పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్సిడి సర్వేపై ఆరా తీసి కొత్తగా దీర్ఘకాలిక రుగ్మతలతో ఎంత మందిని గుర్తించారని తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ జగన్మోహన్ అంగన్వాడీ కేంద్రంలో పిల్లల ఆరోగ్యంపై తెలుసుకొని ప్రతి నెలా పిల్లల బరువు, ఎత్తు నివేదికలు ఖచ్చితంగా నమోదు చేసి ఎదుగుదల, పోషకాహార లోపం లేకుండా చూడాలన్నారు. పిల్లల హెల్త్ స్క్రీనింగ్‌పై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ధనుంజయకుమార్, డెమో యోగీశ్వరరెడ్డి, ఎపిడెమిక్ ఇఒ సత్తిబాబు, సూపర్వైజర్ శంకర్రావు, ఎంటిఎస్ రామకృష్ణ, వైద్య సిబ్బంది సౌజన్య తదితరులు ఉన్నారు.

చింతపండు కొనుగోలు ప్రారంభం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక జిసిసి బ్రాంచ్ పరిధిలో గత కుంతేసులో శుక్రవారం చింతపండు కొనుగోలును ప్రారంభించారు. ప్రభుత్వం నిర్దేశించిన కిలో చింతపండు రూ.36కు గిరిజనుల వద్ద నుంచి కొనుగోలు చేసినట్లు సిబ్బంది తెలిపారు. మొదటిరోజు గిరిజనుల నుంచి 20 క్వింటాళ్ల చింతపండు కొనుగోలు చేసి నగదు చెల్లింపులు చేసినట్లు సేల్స్ మేన్లు సన్యాసినాయుడు, రామన్న దొర, సందీప్ తెలిపారు.

నేటి నుండి చేతిపంపుల నిర్వహణ

ప్రజాశక్తి - మక్కువ

వేసవిలో నీటి ఎద్దడి నివారణలో భాగంగా శనివారం నుంచి 45 రోజుల పాటు చేతి పంపుల నిర్వహణ కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎంపిడిఒ డిడి స్వరూపారాణి తెలిపారు. మండలంలోని 21 పంచాయతీల్లో 426 చేతిపంపులున్నాయని, వీటిలో ఏ విధమైన మరమ్మతుకు గురైన పనిముట్లు మార్పు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.



కొర్రల పంటను పరిశీలిస్తున్న ఎన్‌జి రంగా పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు

పంట పొలాల సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని చిన్నబగ్గ, పిపి ఈతమానుగూడ పంచాయతీల పరిధిలో గల సంకిలి, బిల్లమడ, కె.గుమడ తదితర గిరిజన గ్రామాలను ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు చింతపల్లి ఏడియర్ సైంటిస్ట్ అప్పలస్వామి, సీతంపేట సైంటిస్ట్ లక్ష్మీనారాయణ క్షేత్ర స్థాయిలో సందర్శించారు. రైతులకు సీతంపేట ఎంఆర్ఎస్ నుంచి కొర్రలు, రాగుల విత్తనాలు రైతులకు అందించాలని చెప్పారు. రైతులకు అందించిన పంటల్లో గల చీడపీడల నుంచి రక్షణ గురించి వివరించారు. సేంద్రియ వ్యవసాయ విధానాలపై ఆయా గ్రామాల రైతులకు అవగాహన కల్పించారు. వరి గడ్డిని కాల్చకుండా కుళ్లబెట్టు పద్ధతిలో గెత్తాన్ని తయారు చేసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు భాస్కరరావు, సురేష్, మోహన్, హిందు, వెలుగు అసోసియేషన్ సిబ్బంది, ఏరియా కో-ఆర్డినేటర్లు పాలక నాగేశ్వరరావు, వసంత, కో-ఆర్డినేటర్లు ఉమాలావణ్య, మిన్నారావు, మజ్జయ్య, రవికుమార్, రామయ్య పాల్గొన్నారు.

మేధస్సును వెలికితీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పాఠశాలలలో నిర్వహిస్తున్న సైన్స్ ఎగ్జిబిషన్స్ విద్యార్థుల ఆలోచనలకు మేధస్సును వెలికి తీసే ఒక చక్కని ప్రక్రియ అని ఇది వారి భవిష్యత్తుకు చక్కని పునాది అని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎన్.తిరుపతి నాయుడు అన్నారు. శుక్రవారం ఆయన బిజెపురం, జియ్యమ్మవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో జరిగే సైన్స్ ఎగ్జిబిషన్స్ తిలకించారు. ముందుగా జియ్యమ్మవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎగ్జిబిషన్ ప్రదర్శన చూసిన అనంతరం బిజెపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే ఎక్సిబిషన్‌ను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం బిజెపురంలో పాఠశాల రికార్డులను పరిశీలించిన ఆయన పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి ఈ ఏడాది టెన్త్ విద్యార్థులు పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా సిడి గ్రేడులో ఉన్న విద్యార్థులకు ప్రత్యేకత శిక్షణ ఇచ్చి మంచి మార్కులు వచ్చేలా కృషి చేయాలని ఆదేశించారు. ఈయన వెంట ఎంఇఒ -2 ఎం.శ్రీనివాసరావు, జియ్యమ్మవలస, బిజెపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెఎస్ కుమార్, రఘురామరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ....

సీతంపేట : స్థానిక వివేకానంద విద్యా భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో శుక్రవారం సివి రామన్ జయంతి సందర్భంగా నేషనల్ సైన్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులతో అలరించారు. రోడ్డు భద్రత కాలుష్యం నివారణ, తాగునీరు, కాలుష్యం నివారణ, మూఢనమ్మకాలు తరిమికొట్టడం వంటివి ప్రాజెక్టులను తయారుచేసి అబ్బురపరిచారు. ఇలాంటి ప్రాజెక్టులతో విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతావని ఫౌండర్ గంట సత్యనారాయణ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వేమకోటి సాయికృష్ణ శర్మ, కరస్పాండెంట్ కందుల రాజేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో....

స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఇన్చార్జి ప్రిన్సిపల్ వి.ప్రభాకరరావు అధ్యక్షతన నేషనల్ సైన్స్ డే ఘనంగా నిర్వహించారు. సైన్స్ అధ్యాపకులు బి.నరేష్ మాట్లాడుతూ శాస్త్రం, విజ్ఞానం ఆవిష్కరణలో యువత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొనున్నారు.

ఆదర్శ పాఠశాలలో...

భామిని : స్థానిక ఎపి మోడల్ స్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సైన్స్ ఆవశ్యకతపై అవగాహన పెంపొందించుకొని తమలో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసి నూతన ఆవిష్కరణలకు కృషి చేయాలని ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ తెలియజేశారు. విద్యార్థులకు సైన్స్ క్విజ్ వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సైన్స్ అధ్యాపకులు పి.రవికిషోర్, చుక్కా సంతోష్ కుమార్, మువ్వల జానకి, బిబి హరికృష్ణ, మజ్జి సరస్వతిని దుస్సాలువతో సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బాబురావు , ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం


ప్రాజెక్టును పరిశీలిస్తున్న డిఇఒ తిరుపతినాయుడు

విద్యావికాస్ హైస్కూల్‌లో....

పాఠశాల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించగలిగితే సమాజంలో కాలక్రమేనా మూఢనమ్మకాలు కనుమరుగైపోతాయని విద్యా వికాస్ హైస్కూల్ ప్రిన్సిపల్ ఎం.గాంధీరాజ్ అన్నారు. మండలంలోని గురండి విద్యా వికాస్ హై స్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. విద్యార్థులు చేసిన సైన్స్ ప్రాజెక్టు ఆకట్టుకున్నాయి. ఏడో తరగతి విద్యార్థి అల్లక నరేంద్ర ప్రదర్శించిన సోలార్ సిటీ ప్రాజెక్టు ప్రథమ బహుమతి గెలుచుకుంది. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు జి.రమేష్, ఆర్.దేవి ప్రసాద్, బిహెచ్ శ్రీనివాసరావు వున్నారు.

వీరఘట్టం : మండలంలోని జాతీయ సైన్స్ దినోత్సవం కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరఘట్టంతో పాటు అన్ని గ్రామాల్లో గల పాఠశాలల్లో సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : మండలంలోని పెదబొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇన్చార్జి హెచ్ఎం మర్రాపు ఈశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సైన్స్ ప్రదర్శనతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులు నిర్వహించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు శశిధర్ కుమార్, భవానీ, దేవీప్రసాద్, ఇందిరా కుమారి, స్టాఫ్ సెక్రటరీ సూర్యనారాయణ సైన్స్ గొప్పతనంపై విద్యార్థులకు తెలియజేశారు. మూఢనమ్మకాలపై విద్యార్థినిలు వేసిన స్కిట్ అందరిని అలరించింది.

గుమ్మలక్ష్మీపురం: స్థానిక కస్తూరిబా పాఠశాలలో ప్రిన్సిపల్ సిహెచ్ శ్రీరంజని ఆధ్వర్యంలో సైన్స్ డే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కష్టపడి చదివి మంచి పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, మంచి శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. విద్యార్థులకు ఉన్న ప్రతిభను, విద్యాబోధన పరిస్థితిని పూర్తిగా తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధారాలు తక్షణమే అందజేయాలి

వీరఘట్టం : ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం కింద కొత్తగా ఇళ్ల మంజూరు కోసం ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న దరఖాస్తుదారులు తక్షణమే తమ ఆధారాలు గృహ నిర్మాణ శాఖ కార్యాలయానికి అందజేయాలని స్థానిక ఎఇ వి.వినోద్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో దరఖాస్తుదారులను కోరారు. మండలంలోని 2,100 మంది కొత్త ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వీరంతా వారి వివరాలను తమ కార్యాలయానికి, లేదా అందుబాటులో ఉన్న ఇంజినీరింగ్ సహాయకులకు తక్షణమే అందజేయాలని దరఖాస్తుదారులను ఎఇ కోరారు.

బడ్జెట్లో మన్యం జిల్లాకు మొండిచేయి

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా : సిపిఎం

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

అన్ని రంగాల్లో వెనుకబడిన మన్యం జిల్లా అభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుందని, బడ్జెట్ మొండిచేయి చూపిందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ, బివి రమణ, పి.రాజశేఖర్, నాయకులు పి.సన్యాసిరావు, బి.సూరిబాబు, ఎస్.ఉమామహేశ్వరరావు విమర్శించారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో రాష్ట్ర బడ్జెట్‌పై ప్రచార కరపత్రం విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్లో మన్యం జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులైన జంఝావతి, తోటపల్లి, గుమ్మడిగెడ్డ, వట్టిగెడ్డ ప్రాజెక్టుల పూర్తికి ఎలాంటి కేటాయింపుల్లేవని విమర్శించారు. జిల్లాలో గిరిజన ప్రాంతంలో రోడ్ల నిర్మాణానికి, మరమ్మతులకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమని అన్నారు, డోలీ మోతల దుస్థితి జిల్లాలో నేటికీ కొనసాగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో పిజీ కాలేజీ, యూనివర్సిటీ, ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. జిల్లాలోని మున్సిపల్ పట్టణాల్లో నేటికీ తాగునీరు పూర్తిస్థాయిలో అందించడం లేదన్నారు. రైతుల పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో వ్యవసాయాధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు, పారిశ్రామిక అభివృద్ధికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు నిరసనగా, జిల్లా అభివద్ధికి రూ.10 వేల కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సుకుమార్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

స్థానిక జిల్లా కేంద్ర ఆస్పత్రి నేత్ర వైద్య విభాగంతో పాటుగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్‌గా వ్యవహరించిన డాక్టర్ కె.సుకుమార్‌బాబు సేవలు మరువలేనివని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. శుక్రవారం సుకుమార్ బాబు ఉద్యోగ విరమణ సందర్భంగా జరిగిన సన్మాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిఎంహెచ్ఒ మాట్లాడుతూ జిల్లా అంతత్వ నివారణ సంస్థ ద్వారా గిరిజన మారుమూల ప్రాంతాల్లో నేత్ర వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడంలో ఆయన చొరవ మరువలేనిదని, కంటి వెలుగు కార్యక్రమంలో జిల్లాను ప్రథమ స్థానం పొందడానికి ఆయన కృచేశారని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రుల కోఆర్డినేటర్ డాక్టర్ వాగ్దేవి, జిల్లా ఆసుపత్రి ఆర్ఎంఒ డాక్టర్ శ్యామల, పాలకొండ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ జి.నాగభూషణ రావు, జిల్లా ఆసుపత్రి సిబ్బంది,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉదయం నుంచే పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - కురుపాం

ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ ఉదయం 7 గంటల నుంచే సచివాలయ సిబ్బంది పంపిణీ చేయడం జరుగుతుందని పింఛనుదారులంతా ఈ విషయాన్ని గమనించాలని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ పెన్షన్‌దారుల్లో సంతృప్తి పెంచేందుకు ఉన్నతాధికారులు మొబైల్ అప్లికేషన్‌లో మార్పు చేశారని, ప్రశాంత వాతావరణంలో పెన్షన్లు పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించినట్లు తెలిపారు.

వీరఘట్టం : మండలంలో 9631 మందికి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ బి.వెంకటరమణ శుక్రవారం తెలిపారు. మార్చి 1న ఉదయం 7గంటల నుండి పింఛన్ పంపిణీ అధికారులు పింఛను పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎవరు కూడా కార్యాలయాలు చుట్టూ తిరగొద్దని, మీ ఇంటి వద్దకే వచ్చి పింఛన్ ఇస్తారని, కావున లబ్ధిదారులు ఈ అంశాన్ని గ్రహించగలరని ఆయన కోరారు.